


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 63 | ఆదివారం 2 ఆగష్టు 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## వీసా బాండ్ విధానాన్ని కొనసాగించనున్న యూఎస్..

## 20 వేల డాలర్ల వరకూ అదనపు భారం




గతంలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన వీసా బాండ్ విధానాన్ని కొనసాగించేందుకు అమెరికా విదేశాంగ శాఖ నిర్ణయించింది. శాశ్వత ప్రాతి పదికన ఈ విధానాన్ని అమలు చేసేందుకు నిర్ణయించింది. గతంలో నిర్వహించిన పైలట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో అమెరికా విదేశాంగ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.

2

## భోగాపురం విమానాశ్రయం

## ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే..

- ఉత్తరాంధ్ర పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ
- రూ.18 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అల్లూరి సీతారామరాజు పేరు ఖరారు
- గిరిజన మహిళల థింసా నృత్యం ప్రపంచ రికార్డు సాధించిందన్న ప్రధాని
- చంద్రబాబు దార్శనికతను మనస్ఫూర్తిగా అభినందించిన మోదీ



2

# జలాధివాసంలోకి - సంగమేశ్వరుడు



2

- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తాదులు
- కృష్ణమ్మ పరవళ్లతో గంగమ్మకు పసుపు కుంకుమ చీర సారతో ప్రత్యేక పూజలు

## అసెంబ్లీలో విద్వేష ప్రసంగాలకు చెక్:

## తెలంగాణ స్పీకర్ ఛాంబర్‌లో కమిటీ కీలక భేటీ

- అసెంబ్లీలో వ్యక్తిగత దూషణలకు చెక్ పెట్టడమే ప్రభుత్వ లక్ష్యమన్న పొన్నం ప్రభాకర్
- వారం రోజుల్లో మరోసారి భేటీ కానున్న కమిటీ
- అన్ని పార్టీల సలహాలు తీసుకుంటామన్న మంత్రి

అసెంబ్లీలో విద్వేషపూరిత, రెచ్చగొట్టే వ్యాఖ్యలను నిరోధించేందుకు తెలంగాణ ప్రభుత్వం సన్నా హకాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్ లో సెలెక్ట్ కమిటీ చైర్మన్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈరోజు కీలక సమావేశం జరిగింది.



2

## భద్రాచలం వద్ద ఉగ్ర గోదావరి.. మూడో ప్రమాద హెచ్చరిక జారీ

- నీటిమట్టం 55 అడుగులు దాటి ఉద్ధృతంగా ప్రవాహం
- ఇసుక క్వారీలో చిక్కుకున్న 44 మందిని కాపాడిన అధికారులు
- లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలింపు
- పలు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు



2

## తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్: దరఖాస్తుల తేదీలు ఖరారు




2

- తెలంగాణలో 7,437 పోలీస్ పోస్టుల భర్తీకి ప్రకటన
- ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు
- పోలీస్, ఎస్పీఎఫ్, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో ఖాళీల భర్తీ
- నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేసిన టీఎస్ఎల్‌పీఆర్‌బీ

## ఇంటింటికీ టీడీపీ: 14.60 లక్షల ఇళ్లను సందర్శించిన నేతలు.. పర్యవేక్షిస్తున్న లోకేశ్

- 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన
- ఆరు రోజుల్లో 14.60 లక్షల ఇళ్లను సందర్శించిన కూటమి శ్రేణులు
- రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తున్న నేతలు
- కార్యక్రమ పురోగతిని సమీక్షిస్తూ శ్రేణులను అభినందించిన నారా లోకేశ్
- అవాంతరాలు ఎదురైనా కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగించడం పై హర్షం



VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## వీసా బాండ్ విధానాన్ని కొనసాగించనున్న యూఎస్..

### 20 వేల డాలర్ల వరకూ అదనపు భారం

విజిటర్ వీసాల కోసం దరఖాస్తు చేసుకునేవారు ముందుగా 15 వేల డాలర్ల వరకూ బాండ్ సమర్పించాలంటూ ఏడాది క్రితం అమెరికా ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని తీసుకొచ్చింది. బీ-1 (బిజినెస్), బీ-2 (టూరిస్ట్) వీసాలకు దరఖాస్తు చేసుకునే వారు ఈ బాండ్ సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు ఈ బాండ్ సమర్పించాలా? వాద్దా? అనేది కాన్సులార్ ఆఫీసర్లు నిర్ణయిస్తారు. వీసా గడువులోపు విదేశీయులు అమెరికాను వీడితే ఈ మొత్తాన్ని తిరిగిచ్చేస్తారు. లేకపోతే డబ్బును కోల్పోవాల్సి ఉంటుంది. అక్రమ వలసలను నిరోధించేందుకు అమెరికా ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా దరఖాస్తుదారులు 5 వేలు, 10 వేలు లేదా 15 వేల డాలర్ల బాండ్స్‌ను సమర్పించేవారు.

**గరిష్ఠ బాండ్ పరిమితి పెంపు..**

ప్రస్తుతం అమలు చేయనున్న విధానంలో మాత్రం 5 వేల బాండ్ ఆప్షన్‌ను అమెరికా తొలగించింది. అంతేకాకుండా, గరిష్ఠ బాండ్ పరిమితిని 20 వేల డాలర్లకు పెంచింది. ఏడాది పాటు పైలట్ ప్రాజెక్టు ఫలితాలను పరిశీలించిన అనంతరం ఈ విధానాన్ని శాశ్వతంగా కొనసాగించేందుకు అమెరికా విదేశాంగ శాఖ నిర్ణయించింది. ఆగస్టు 3 నుంచి ఇది అమల్లోకి రానుంది.

**భారతీయులకు ఊరట..**

మొత్తం 50 దేశాల వారికి ఈ బాండ్ విధానం వర్తిస్తుందని అమెరికా తెలిపింది. అయితే, ఈ జాబితాలో భారత్ లేకపోవడంతో ఇండియన్స్‌కు ఉపశమనం దక్కింది. అయితే, ఈ విధానాన్ని వలసదారుల హక్కుల కార్యకర్తలు, సంస్థలు మాత్రం విమర్శిస్తున్నాయి. బాండ్ భారంగా మారి అర్హులైనవారు అమెరికాకు దూరమయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నాయి.

## భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే..

పవిత్రమైన ఉత్తరాంధ్ర గడ్డ పై అడుగుపెట్టడం తనకు ఎంతో గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సహా సుమారు రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో, తెలుగులో అందరికీ నమస్కారం అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు అర్పించారు. నేటి రోజు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో, ముఖ్యంగా స్వర్ణాంధ్ర విజన్‌లో ఒక కీలకమైన రోజని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యమైన 'థింసా' ప్రదర్శన తనను మధురానుభూతికి లోనుచేసిందని ప్రధాని తెలిపారు. ఒకేసారి 13 వేల మంది గిరిజన మహిళలు ఈ నృత్యం చేయడం ఒక అద్భుతమని, ఇది ప్రపంచ రికార్డు సృష్టించిందని కొనియాడారు. ఈ నృత్యంలో మన తరతరాల వారసత్వం స్పష్టంగా కనిపించిందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రధాని మోదీ హృదయపూర్వకంగా అభినందించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఒక కొత్త 'రన్‌వే'గా పనిచేస్తుందని మోదీ ఉద్ఘాటించారు. ఇది ఆంధ్ర యువత ఉజ్వల భవిష్యత్తుకు ఒక 'లాంచ్‌ప్యాడ్' అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో దేశంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒకే కుటుంబం పేర్లు కనిపించేవని, కానీ తమ ప్రభుత్వం మహనీయుల పేర్లను పెడుతోందని స్పష్టం చేశారు. "అయోధ్యలో విమానాశ్రయానికి వాల్మీకి మహర్షి పేరు పెట్టాం. పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరుతో ఎయిర్‌పోర్ట్ ప్రారంభించాం. అదేవిధంగా భోగాపురం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం" అని ప్రధాని వివరించారు. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌ను వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## భద్రాచలం వద్ద ఉగ్ర గోదావరి.. మూడో ప్రమాద హెచ్చరిక జారీ

భద్రాచలం వద్ద గోదావరి నది మహోగ్ర రూపం దాల్చింది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు పోటెత్తడంతో నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. శనివారం ఉదయానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 55.1 అడుగులకు చేరడంతో అధికారులు మూడో, చివరి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గురువారం కేవలం 30 అడుగుల వద్ద ఉన్న నీటిమట్టం, కాళేశ్వరం నుంచి వస్తున్న వరద ప్రవాహంతో శుక్రవారం అర్ధరాత్రికి 53 అడుగులకు, శనివారం ఉదయానికి 55.1 అడుగుల ప్రమాదకర స్థాయికి చేరింది. పరిస్థితిని సమీక్షించిన జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్.. లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలకు సూచించారు. వరద ఉధృతి కారణంగా పర్ణశాల వద్ద స్నానఘట్టాలు పూర్తిగా జలమయమయ్యాయి. సీతవాగు ఉధృతికి సీతమ్మ నార చీరలు, దేవతామూర్తి పీఠంతో పాటు ఇనుప వంతెన కూడా మునిగిపోయాయి. దుమ్ముగూడెం-భద్రాచలం మధ్య శుక్రవారం సాయంత్రం నుంచే రాకపోకలు నిలిచిపోయాయి. తురుబాక ఆర్ అండ్ బీ రహదారి పై నిర్మించిన వంతెన అప్రోచ్ రోడ్లు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. చార్ల మండలం వీరాపురం శివారులోని ఇసుక క్వారీలో అకస్మాత్తుగా వరద రావడంతో 44 మంది లారీ డ్రైవర్లు, స్థానికులు చిక్కుకుపోయారు. అధికారులు వారిని సురక్షితంగా కాపాడారు. అయితే 30కి పైగా లారీలు అక్కడే నీటిలో చిక్కుకుపోయాయి. సహాయక చర్యల సమయంలో ఇద్దరు పోలీసు అధికారులు తెప్పపై నుంచి నీటిలో పడినా, ఈదుకుంటూ క్షేమంగా బయటపడ్డారు. అశ్వాపురం మండలంలో ఓ గర్భిణిని థర్మాకోల్ తెప్పపై సురక్షిత ప్రాంతానికి తరలించారు. మరోవైపు, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణలో రాబోయే ఐదు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

## అసెంబ్లీలో విద్వేష ప్రసంగాలకు చెక్: తెలంగాణ స్పీకర్ ఛాంబర్‌లో కమిటీ కీలక భేటీ

అసెంబ్లీలో విద్వేషపూరిత, రెచ్చగొట్టే వ్యాఖ్యలను నిరోధించేందుకు తెలంగాణ ప్రభుత్వం సన్నాహకాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో సెలెక్ట్ కమిటీ ఛైర్మన్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈరోజు కీలక సమావేశం జరిగింది. ఈ భేటీకి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవ లక్ష్మి, కూనంనేని సాంబశివరావు, మాణిక్ రావు హాజరయ్యారు. సమావేశంలో విద్వేష ప్రసంగాలు, క్రైమ్ బిల్లు ప్రతిపాదనలపై సమగ్రంగా చర్చించారు. సమావేశం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ పరిధిలో సభ్యులు భావప్రకటనా స్వేచ్ఛను వినియోగించుకుంటూనే, ఇతరులను వ్యక్తిగతంగా దూషించడం లేదా విద్వేషపూరిత ప్రసంగాలు చేయకుండా ఉండేలా బలమైన చట్టం తీసుకురావడమే తమ కమిటీ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. శాసనసభ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు ఈ క్రైమ్ అండ్ హేట్ స్పీచ్ బిల్లు పై పూర్తి నివేదికను అసెంబ్లీకి సమర్పించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. వారం రోజుల్లో కమిటీ మరోసారి సమావేశం కానుంది. వివిధ రాజకీయ పార్టీలతో పాటు సమాజంలోని ప్రముఖులు, నిపుణుల సలహాలను పరిగణనలోకి తీసుకుని నివేదికను తుదిరూపు ఇస్తామన్నారు. ఈ చట్టం ఎవరి హక్కులనూ కాలరాయదని, కేవలం సభ గౌరవాన్ని, వ్యక్తుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకేనని భరోసా ఇచ్చారు.

# జలాదివాసంలోకి- సంగమేశ్వరుడు









ఆత్మకూరు ఆగస్టు 1 వార్త సాక్ష్యం

సప్తనదుల సంగమ క్షేత్రలోని సంగమేశ్వరుడిని కృష్ణ నది జలాలు తాకాయి.ఎగువ ప్రాంతాల నుంచి కృష్ణ నదికి వరద ఉధృతి పెరగడంతో కృష్ణా జలాలు ఆలయాన్ని చుట్టుముట్టాయి. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ సంగమేశ్వర స్వామి గర్భాలయంలో వేపదారు శివలింగానికి చివరిసారిగా కృష్ణానది జలాలతో ప్రత్యేక అభిషేకాలు చేసి పూజలు నిర్వహించారు.అనంతరం కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి చీర సారె సమర్పించి గంగా హారతిని ఇచ్చారు. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండల పరిధి లోని సంగమేశ్వరుడి పుణ్యక్షేత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అత్యంత ప్రాచీన, ఆధ్యాత్మిక విశిష్టత కలిగిన పుణ్యక్షేత్రాలలో సంగమేశ్వరం ఒకటి. కృష్ణవేణి, తుంగ, భద్ర, భీమా, మలపహారిణి, భవనాసి అనే నదుల కలయికతో సప్తనదీ సంగమంగా ప్రఖ్యాతి గాంచింది. ద్వాపర యుగంలో పాండవులు వనవాస సమయంలో ధర్మరాజు ఇక్కడ వేప చెట్టును నరికి వేపదారు శివలింగాన్ని ప్రతిష్ఠించాడని, అందుకే స్వామి వారిని వేపదారు సంగమేశ్వరుడు అని కూడా పిలుస్తారు.శ్రీశైలం జలాశయం వెనుక జలాల్లో ఉండే ఈ దేవాలయం, ప్రతి సంవత్సరం నాలుగు నెలలు భక్తులకు దర్శనమిచ్చి మరో ఎనిమిది నెలలు శ్రీశైలం బ్యాక్ వాటర్లో మునిగిపోతుంది. ఈ సంవత్సరం మార్చి 22వ తారీఖున సంగమే శ్వరాలయం బయట పడగా ఆగస్టు ఒకటో తేదీ వరకు సంగమే శ్వరుడు 131 పూజలందుకొని జలాదివా సంలోకి వెళ్లినట్లు ఆలయ పురోహితులు రఘురామ శర్మ తెలుపారు. తెలుగు రాష్ట్రాలలో ఎలినో ప్రభావంతో వర్షాలు లేకపోవడంతో శ్రీశైలం జలాశయం పూర్తిగా అడుగంటింది. దీంతో సంగమేశ్వరుడు సుమారు ఐదు నెలల పాటు భక్తులచె పూజలు అందుకున్నాడు. శ్రీశైలం జలాశయంలో 840 అడుగులకు నీరు చేరుకోవడంతో ఆలయంలోకి కృష్ణానది జలాలు చేరడంతో సంగమేశ్వరుడు జలాదివాసములోకి వెళ్ళాడు. శ్రీశైలం జలాశయంలో నీరు 850 అడుగు లకు చేరుకుంటే సంగమేశ్వర క్షేత్రం పూర్తిగా జలాధివాసంలోకి వెళుతుంది

## ఇంటింటికీ టీడీపీ: 14.60 లక్షల ఇళ్లను సందర్శించిన నేతలు.. పర్యవేక్షిస్తున్న లోకేశ్

తెలుగుదేశం పార్టీ ప్రతిష్మాత్మకంగా ప్రారంభించిన 'ఇంటింటికీ టీడీపీ -- 2ఏళ్ల నమ్మకం, అభివృద్ధి--సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమం ఆరో రోజుకు చేరుకుంది. గత ఆరు రోజుల్లో కూటమి శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 14.60 లక్షల ఇళ్లను సందర్శించి, ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించాయి. శనివారం ఒక్కరోజే కూటమి నాయకులు, కార్యకర్తలు సుమారు 2.60 లక్షల కుటుంబాలను కలిశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, అన్ని స్థాయిల నాయకులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఇంటింటికీ వెళ్లి రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం సాధించిన ప్రగతిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమ పురోగతిని తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ఎప్పటికప్పుడు నియోజకవర్గాల వారీగా సమీక్షిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతూ కార్యక్రమాన్ని మరింత సమర్థంగా నిర్వహిస్తున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొనడం, కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసినప్పటికీ అత్యధిక చోట్ల కూటమి శ్రేణులు ఉత్సాహంగా పాల్గొనడంపై లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.

## తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్: దరఖాస్తుల తేదీలు ఖరారు

తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో 7,437 పోస్టుల భర్తీకి సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ తేదీలను ప్రభుత్వం ఖరారు చేసింది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) బుధవారం నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లను విడుదల చేసింది. పోలీస్ శాఖతో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్), అగ్నిమాపక, జైళ్ల శాఖల్లోని ఖాళీలను ఈ నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. మొత్తం ఖాళీలలో అత్యధికంగా కానిస్టేబుల్, ఆ పైస్థాయి ఉద్యోగాలే ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. పోస్టుల వివరాలను పరిశీలిస్తే సివిల్ ఎస్సై-148, ఏఆర్ ఎస్సై-14, టీజీఎస్పీ ఏఆర్ ఎస్సై-12, ఎస్ఏఆర్ సీపీఎల్ ఎస్సై-03, ఫింగర్ ప్రింట్ బ్యూరో ఏఎస్సై-23, సివిల్ కానిస్టేబుల్-3,697, ఏఆర్ కానిస్టేబుల్-1,052, ఎస్ఏఆర్ సీపీఎల్ కానిస్టేబుల్-24, కానిస్టేబుల్ (డ్రైవర్) పీటీవో-20, కానిస్టేబుల్ (మెకానిక్) పీటీవో-07 చొప్పున ఖాళీలు ఉన్నాయి.

## ఎమర్జెన్సీకి ఆర్‌ఎస్‌ఎస్ మద్దతిచ్చిందని జైరాం రమేశ్ వాదన

దేశంలో ఇందిరా గాంధీ విధించిన అత్యవసర స్థితి (ఎమర్జెన్సీ)కి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) మద్దతు తెలిపిందన్న తన వాదనను నిరూపించేందుకు కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ రాజ్యసభలో కీలక ఆధారాలను సమర్పించారు. 1975లో నాటి ఆర్ఎస్ఎస్ అధినేత బాల సాహెబ్ దేవరస్ రాసిన మూడు లేఖలను ఆయన శుక్రవారం సభాపతికి అందజేశారు. ఎమర్జెన్సీకి ఆర్ఎస్ఎస్ మద్దతునిచ్చిందనడానికి ఆధారాలు చూపాలని బీజేపీ ఎంపీలు గురువారం విసిరిన సవాలుకు సమాధానంగా జైరాం రమేశ్ ఈ చర్య తీసుకున్నారు. ఈ లేఖలను చారిత్రక ఆధారాలుగా జైరాం రమేశ్ పేర్కొన్నారు. వీటిలో రెండు లేఖలను దేవరస్ నాటి ప్రధాని ఇందిరా గాంధీకి రాయగా, మరొకటి ఆచార్య వినోబా భావేకి రాశారు. 1975 ఆగస్టు 22న ఇందిరా గాంధీకి రాసిన లేఖలో, ఆమె చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం "సమయోచితంగా, సమతుల్యంగా ఉంది" అని దేవరస్ ప్రశంసించారు. ఆర్ఎస్ఎస్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతూ, దేశాభివృద్ధిలో తమ సంస్థ సేవలను వినియోగించు కోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 1975 నవంబర్ 10న రాసిన మరో లేఖలో, ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లుబాటును సుప్రీంకోర్టు సమర్థించినందుకు ఆమెకు అభినందనలు తెలిపారు. జయప్రకాశ్ నారాయణ్ (జేపీ) ఉద్యమంతో ఆర్ఎస్ఎస్ కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తూ, సంస్థపై నిషేధాన్ని ఉపసంహరించుకోవాలని మరోసారి కోరారు. ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికల్లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు భాగస్వాములు అయ్యేలా, ప్రధానికి తమపై ఉన్న అపోహలను తొలగించాలని వినోబా భావేను ఆయన కోరారు.

వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 2 ఆగస్టు 2026

# పుట్టిన బిడ్డలకు తల్లిపాలే దివ్య ఔషాదం



కొత్తపల్లి ఆగస్టు 1 వార్త సాక్ష్యం

పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరమని పుట్టిన వెంటనే తల్లిపాలు బిడ్డకు తాపాలి అని ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగేశ్వరమ్మ తెలిపారు. శనివారం మండలంలోని పెద్ద గుమ్మడాపురం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరం అని పుట్టిన వెంటనే తల్లిపాలు తాపాలి అన్నారు. తల్లిపాలు రాలేదని పుట్టిన బిడ్డలకు గ్లూకోజు నీళ్లు, చక్కెర నీళ్లు, తేనె నీళ్లు ఇవ్వకూడదు అన్నారు. తల్లిపాల వారోత్సవాలు ఒకటవ తేదీ నుండి ఏడవ తేదీ వరకు ప్రతిరోజు అన్ని అంగన్వాడి కేంద్రంలో నిర్వహించడం జరుగుతుంది అన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో అందుతున్న పౌష్టికాహారం గర్భవతులు, బాలింతలు తీసుకొని ఆరోగ్యంగా ఉండాలి అన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టించుట, తల్లిపాలు పిండి పారబోయకూడదు అన్నారు. ఈ మొదటి పాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుంది. పసుపు రంగులో పాలు మొదటి టీకాగా బిడ్డకు అందించాలి. పిల్లలకు మధ్యలో బిస్కెట్, కుర్కురేలు ఇవ్వకూడదు అని తల్లులకు సూచించారు. తల్లిపాల వారోత్సవాలపై గ్రామంతోపాటు, గూడెంలో ర్యాలీ సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు మౌనిక, అంగన్వాడీ టీచర్లు ధనలక్ష్మి, మల్లేశ్వరి బాయి, భారతి, ఆశా వర్కర్స్ రాజేశ్వరి, రవణమ్మ మహిళలు పాల్గొన్నారు.ం

# పంటల భీమా గడువు పెంపు

-మండల వ్యవసాయ శాఖ అధికారిని కే.హేమలత



ఆత్మకూరు ఆగస్టు1 వార్త సాక్ష్యం

ఖరీఫ్ సీజన్లో పంటల భీమా నమోదుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఈనెల 15.వ తేదీ వరకు గడువు పెంచడం జరిగిందనీ ఆత్మకూరు మండల వ్యవసాయ శాఖ అధికారి ని కే. హేమలత అన్నారు శనివారం మండల పరిధిలోని కురుకుంద గ్రామం లోని రైతు సేవా కేంద్రంలో రైతు సదస్సుపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేశారు సమావేశంలో మండల వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, వరదలు ,కరువు వంటి అనూహ్య పరిస్థితులు ఎదురైనప్పుడు పంట నష్టం వాటిలితే మీ కుటుంబానికి ఆర్థిక భరోసా ఇచ్చేది,ఈ ఏడాది శ్రమకు భద్రత కల్పించేది పంటల భీమా మాత్రమే అని తెలిపారు. చివరి రోజు వరకు వేచి చూడకుండా ప్రతి రైతు వెంటనే అప్రమత్తంగా వ్యవహరించి పంటల భీమా నమోదు పొడిగించిన గడువునుఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు .రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం నమోదు ప్రక్రియను సులభతరం చేసింది. రైతులు స్వయంగా క్రాప్ ఇన్సూరెన్స్ ,ఫార్మర్ యాప్ ద్వారా లేదా మీ సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ లో, సంబంధిత బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, గ్రామ మరియు మండల వ్యవసాయ అధికారులతో నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. నమోదు సమయానికి భూమి వివరాలు ,బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు వంటి అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకొని నమోదు పూర్తయిన తర్వాత రసీదును తప్పనిసరిగా భద్రపరుచుకోవాలని తెలిపారు .పంటలవారీ గా బీమా ప్రీమియం ఎకరానికి వరికి రూ.800 , శనగలు ,కంది రూ 400, ఎర్ర మిరపకు రూ 2850, మొక్కజొన్నకు రూ 660, మినుములు 190, ఉల్లి పంటకి రూ 450 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సాజిద్ భాష, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ప్రజా వైద్యులు డాక్టర్ గౌరీనాథ్ మృతికి ఘన నివాళులు

-ఆత్మకూరు సిపిఎం పార్టీ

ఆత్మకూరు ఆగస్టు 1 వార్త సాక్ష్యం

ఆత్మకూరు ప్రాంతంలో ప్రజానీకానికి మెరుగైన వైద్యం అందిస్తున్న డాక్టర్ గౌరీనాథ్ మృతి ప్రజా వైద్యానికి తీరనిలోటని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. యేసు రత్నం,సీనియర్ నాయకులు ఏ.రాజశేఖర్ లు అన్నారు. శనివారం సిపిఎం పార్టీ నాయకులు డాక్టర్ గౌరీనాథ్ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూల్ లో వైద్య విద్యను అభ్యసించి ఆత్మకూరు పట్టణంలో హాస్పటల్ ఏర్పాటు చేశాక ఒకవైపు ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందించేవారు అని అన్నారు. మరోవైపు పట్టణ అభివృద్ధికి జన విజ్ఞాన వేదికలో పనిచేస్తూ సైన్సు పైన ప్రజలకు అవగాహన కల్పిస్తూ పట్టణ అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐ ప్రజా నాట్యమండలిలో ఉద్యమ అభివృద్ధికి చురుకుగా పాల్గొన్నారు. అనంతరం ఆత్మకూరు పట్టణంలో వైద్యం చేస్తూ వామపక్ష భావజాలంతో పని చేశారని అన్నారు. వైద్య సేవలో ఆత్మకూరు ప్రాంతంలో క్రిమిసంహారక మందు తాగిన పిల్లలకు మెరుగైన వైద్యం అందించడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. అతి తక్కువ ఖర్చుతో ప్రజలకు వైద్యం అందించడంలో డాక్టర్ గౌరీనాథ్ ఒకరిని అన్నారు. దాదాపు 40 సంవత్సరాలకు పైగా ఆయన ఆత్మకూరులో వైద్య వృత్తిలో కొనసాగుతూ వైద్యుడిగా పని చేస్తూ సామాజిక స్పృహతో ఉండేవారని ఉమ్మడి కర్నూలు జిల్లాలో పౌర హక్కుల సంఘం లో ఉపాధ్యక్షుడిగా ఆయన సేవలు అందించారని డాక్టర్ గౌరీనాథ్ మృతికి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు సిపిఎం పార్టీగా ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్,మండల కార్యదర్శి పి సుధాకర్, కొత్తపల్లి మండల కార్యదర్శి ఎన్ స్వాములు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్, సిపిఎం పార్టీ పట్టణ నాయకులు డి. రామ్ నాయక్,ఏ సురేంద్ర,షేక్ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

# హరికిషన్ సింగ్ సుర్జీత్ ఆశయాల కోసం పయనిద్దాం

- సిపిఎం

ఆత్మకూరు ఆగస్టు 1 వార్త సాక్ష్యం

హరి కిషన్ సింగ్ సుర్జీత్ ఆశయాల సాధన కోసం పయనిద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. యేసు రత్నం, సీనియర్ నాయకులు ఏ. రాజ శేఖర్, పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్ లు పిలుపు నిచ్చారు. పట్టణంలోని సుదర్శన వర్మ భవన్ నందు హరికిషన్ సింగ్ సుర్జీత్ గారి 18వ వర్ధంతి సభ ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరికిషన్ సింగ్ సుర్జీత్ గారు భగత్ సింగ్ ను ప్రేరణ తీసుకొని తన 14 సంవత్సరాల చిన్నవయసులోనే బ్రిటిష్ కోర్టుపై జెండా ఎగరవే యాలని కాంగ్రెస్ పిలుపును అందుకొని, బ్రిటి షర్లు కాల్పులకు పిలుపు చిన్నప్పటికి బేదరకుండా, జండా ను ఎగుర వేసిన ధీర శాలి అని వారు కొనియాడారు. మార్చి- 23- 1916న పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్ లో జన్మించారు. సిక్కు కుటుంబంలో జన్మించిన ఆయన పంజాబ్ సిక్కుల తలపాగను జీవితాంతం ధరించినప్పటికీ, ఆయన నాస్తికుడని వారు తెలియజేశారు. 1930లో నవజీవన్ భారత్ లో ఆయన సభ్యులుగా చేరారు.1936 లో కమ్యూనిస్టు పార్టీ లో చేరారు . కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటుచేసిన పంజాబ్ రాష్ట్రంలో అఖిల భారత రైతు సమాఖ్య స్థాపించిన వారిలో ఆయన ఒకరు అని వారు వివరించారు. తన తల్లిదండ్రుల ద్వారా సంక్రమించిన ఆస్తిని మొత్తం రెండు భాగాలుగా చేసి ఒకభాగం సైనికులకు అలాగే రెండోవభాగం తన పార్టీ అభివృద్ధి కొరకు దార దత్తం చేసిన మహనీయుడు అని వారు కొనియాడారు. నేడు సంకీర్ణ ప్రభుత్వాలు నడుస్తున్నాయి అంటే అది హరికిషన్ సింగ్ సుర్జీత్ గారి చలువే అని చెప్పాలి. నాడు కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాల మాట వినకుండా ఏక చక్ర అధిపత్యం పాలన చేస్తుందని దానికి ఫుల్ స్టాప్ పెట్టడం కోసం నాడు హరి కిషన్ సింగ్ సుర్జీత్ సంకీర్ణ ప్రభుత్వాలకు పునాది వేశారు. నాటినుండి నేటి వరకు సంకీర్ణ ప్రభుత్వాలు నడుస్తా ఉన్నాయని



అది హరి కిషన్ సింగ్ సుర్జీత్ చలువే అని వారు వివరించారు.1992 నుండి 2006 వరకు సిపిఎం పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని ,ఆయన 2008 ఆగస్టు 1 తేదీన తన తుది శ్వాసను ఉత్తరప్రదేశ్లోని నోయిడా లోవదిలారని వారు తెలియ జేశారు. ఇక్కడ మనం ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ కొత్తపల్లి మండల కార్యదర్శి ఎన్ స్వాములు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్, సిపిఎం పార్టీ పట్టణ నాయకులు డి. రామ్ నాయక్,సురేంద్ర , వీరన్న, నాయకులు పాల శివుడు, తో పాటు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# తంగేడంచ గ్రామంలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం





-టీబీ ముక్త్ భారత్ అభియాన్ కింద ఛాతీ ఎక్స్రే స్క్రీనింగ్

-ఆరోగ్యశాఖ టీబీ సూపర్వైజర్ చక్రపాణి

-టీబీ నీ (క్షయ) వ్యాధి నీ తరిమికొడదాం ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

-హెల్త్ సూపర్వైజర్ విజయలక్ష్మి

జూపాడు బంగ్లా ఆగస్టు 1 వార్త సాక్ష్యం

జూపాడుబంగ్లా మండల పరిధిలోని తంగడంచ గ్రామంలో శనివారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించరు సందర్భంగా జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మండల వైద్య అధికాలు,డాక్టర్. గంగాధర్ డాక్టర్ సభ గ్రామ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు అనంతరంటీబీ.సూపర్వైజర్ చక్రపాణి, హెల్త్ సూపర్వైజర్ విజయలక్ష్మి ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ మన ప్రధాన మంత్రి టీబీ ముక్తు భారత్ అభియాన్ కార్యక్రమం లో బాగంగా ఈ వైద్య శిబిరాశీ ఏర్పాటు చేసి భారత దేశంలో క్షయ వ్యాధి నీ అంతం చేయడానికి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు క్షయ వ్యాధి మరణాలను తగ్గించి టీబీ లక్షణాలను వేగంగా సోకకుండా తగు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకునే విధంగా ముక్త్ భారత్ అభియాన్ అని చెప్పుకోవచ్చు టీబీ నీ తరిమికొట్టాలి దైర్యంగా ఉండాలి అధైర్య పడనవసరం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. మన ఆరోగ్యాన్ని కాపాడుకున్న కాపాడుకునే విధంగా చొరవ తీసుకోవాలని తెలియజేశారు .జూపాడుబంగ్లా తంగే డంచ గ్రామల లో ఏర్పాటు చేసిన ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం లో తంగేడంచ సబ్ సెంటర్ లో టీబీ ముక్త్ భారత్ క్యాంప్ ను,ఉచిత సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు బిపి, షుగర్, టిబి, ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరిగింది. క్షయ వ్యాధి లక్షణాలు రెండు వారాల నుంచి దగ్గు జ్వరం ఆకలి మందలించడం బరువు తగ్గటం రాత్రిళ్ళు చెమటలు పట్టడం తగ్గినప్పుడు తెమడలో రక్తం పడటం వంటి ఉన్నట్లయితే దగ్గర్లోని హాస్పిటల్ కి వెళ్లి తెమడ పరీక్ష ఎక్స్రే పరీక్ష ద్వారా టీవీ నిర్ధారణ అయితే ఆరు నెలల క్రమం తప్పకుండా మందులు వాడితే క్షేవ్యాధిని పూర్తిగా నివారించవచ్చునని టీబీ సూపర్వైజర్ చక్రపాణి వారు ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది.మరియు క్షయ వ్యాధిగ్రస్తుడు మందులు వాడుతున్న అంతకాలం పోషణ భత్యం నిమిత్తం నిక్షయ పోషణ యోజన పథకం ద్వారా ఇవ్వడం జరుగుతుంది. క్షయ వ్యాధి అనుమానితుల వారి వద్ద నుండి కెమెరా శాంపుల్స్ సేకరించి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ తో అనుసంధానం కలిగిన ఎక్స్రే పరీక్షలు చేయడం జరిగినది. అత్యంత ఆధునికకరమైనటువంటి హ్యాండ్ ఓల్డ్ ఎక్స్రే ద్వారా ఛాతి ఎక్స్రే పరీక్ష నిర్వహించడం జరిగింది. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని వారు తెలిపారు.వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని మలేరియా డెంగ్యూ, వ్యాధులు ప్రబలకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలను అవగాహన కల్పించారు. అంతేకాకుండా ప్రతి వ్యక్తికి ముందస్తు రోగ నిర్ధారణ నాణ్యమైన చికిత్స మరియు సంరక్షణ అందుబాటులో ఉండే క్షయ రహిత లక్ష్యంగా ఉండాలన్నదే మన భారతదేశం అని తెలిపారు అంతేకాకుండా క్షయ వ్యాధిని ముందస్తుగా నే గుర్తించి పూర్తిగా చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. ఏదైనా అనారోగ్య సమస్యలు ఉంటే ప్రభుత్వం ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. టీబీ రహిత భారతదేశం లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపును ఇచ్చారు. ఈ కార్యక్రమం లో టీబీ ల్యాబ్ సూపర్వైజర్ ఉపేంద్ర వారు పాల్గొని వచ్చిన ప్రజలందరికీ కూడా వారికందరికీ ఎక్స్రే పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమం లో తంగెడంచ హెల్త్ సచివాలయం హెల్త్ సెక్రటరీ వేల్పుల శ్వేత, మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎమ్ ఎల్ హెచ్ పి లు రాజ్ కుమార్ , అనూష, మరియు ఆశాలు రాములమ్మ, శ్యామలమ్మ, నాగలక్ష్మి, సుమలత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక Editor : SAGINALA RAVI KUMAR



# రాష్ట్రంలో కూటమిపాలనలో.. అభివృద్ధి నమ్మకం...ప్రజల నమ్మకం





-శ్రీశైలం నియోజకవర్గం అభివృద్ధి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తోనే సాధ్యం

-పట్టణంలో 72వ బూత్ లో ఇంటింటి సంక్షేమ పథకాలు పై అవగాహన

-11వ వార్డు టిడిపి ఇఛీన్చార్జ్ అమ్ముల్లా

-టిడిపి మైనార్టీ సీనియర్ నాయకుడు, ప్రజా సామాజికవేత మోటర్ షఫీవుల

ఆత్మకూరు ఆగస్టు 1 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు అభివృద్ధి చేయడంలో ముందుంటుందని రెండు సంవత్సరాల పాలనలో ప్రజలకు ఇచ్చిన అభివృద్ధి నమ్మకమే.. ప్రజల్లో నిలిచిందని టిడిపి పార్టీ ఆత్మకూరు పట్టణ 11వ వార్డు ఇంచార్జి అమ్ముల్లా, టిడిపి మైనార్టీ సీనియర్ నాయకులు ప్రజా సామాజికవేత పేద ప్రజల ఆపద్బాంధవుడు మోటార్ షఫీవులలు పేర్కొ న్నారు శనివారం పట్టణంలోని శ్రీశైలం నియోజ కవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాలతో 11వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ కూటమి సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు శ్రీశైలం నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తోనే సాధ్యమవుతుందని వివరించారు వార్డు ప్రజలకు ప్రభుత్వ అమలు చేసే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, పక్క గృహాల నిర్మాణం పనులు, వార్డు అభివృద్ధి తో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు అందించడమే కూటమి పాలన ఆశయమని కొనియాడారు ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడుతున్న ప్రజా అధినేత ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆశయం కోసం పనిచేస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో 72వ బూత్ కన్వీనర్ అలీ ఖాన్, ఫిరోజ్ ఖాన్, ఎస్. ఎండి. షరీఫ్, మనియార్, సయ్యద్ భాష, తదితరులు పాల్గొన్నారు

# 85 వ్యవసాయ మోటార్లు రైతులకు అప్పగింత

-పోలీసులను సన్మానించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల

-పొన్నూరులో అభినందన సభ.. జిల్లా పోలీసు శాఖకు రైతుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు

పొన్నూరుఆగస్టు 1 వార్త సాక్ష్యం :


పొన్నూరు పరిసర ప్రాంతాల్లో చోరీకి గురైన 85 వ్యవసాయ మోటార్లను రికవరీ చేసి బాధిత రైతులకు అందజేసిన గుంటూరు జిల్లా పోలీసు అధికారులను ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఘనంగా సన్మానించారు. రైతుల తరఫున జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌తో పాటు పోలీసు బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ మోటార్ల వరుస చోరీలతో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు ఊరటనిస్తూ గుంటూరు జిల్లా పోలీసులు రికవరీ చేసిన 85 మోటార్లను శుక్రవారం పొన్నూరు శివారులోని గోవాడ చౌదరి ఫంక్షన్ హాల్‌లో బాధిత రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పోలీసు అధికారులను ఘనంగా సన్మానించి రైతుల తరఫున అభినందిం చారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన పొన్నూరు నియోజకవర్గంలో బోరు మోటార్లే రైతులకు జీవనాధా రమని ఎమ్మెల్యే తెలిపారు. మునిపల్లె, గాయంవారి పాలెం, దండమూడి, కట్టెంపూడి, పొన్నూరు, చింతలపూడి, వడ్డిముక్కల తదితర గ్రామాల్లో జరిగిన మోటార్ల చోరీలను పోలీసులు సవాలుగా తీసుకుని ప్రత్యేక బృందాలతో దర్యాప్తు జరిపి నిందితులను అరెస్టు చేసి 85 మోటార్లను స్వాధీనం చేసుకోవడం అభినందనీయమన్నారు.



జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ రైతుల ఆస్తుల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ-360 వ్యవస్థ, ప్రత్యేక దర్యాప్తు బృందాల సమన్వయంతో నిందితులను గుర్తించి మోటార్లను రికవరీ చేసినట్లు తెలిపారు. ప్రజల సహకారంతో నేరాల నియంత్రణను మరింత సమర్థవంతంగా కొనసాగిస్తామని చెప్పారు. పొన్నూరు రూరల్ సీఐ కృష్ణయ్య మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు పోలీసుల సేవలను గుర్తించి సన్మానించడం అరుదైన విషయమన్నారు. వందలాది సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషించి నిందితులను గుర్తించి మోటార్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రికవరీ చేసిన మోటార్లు తిరిగి అందుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ జిల్లా పోలీసు శాఖతో పాటు సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, టౌన్ సీఐ కిషోర్‌బాబు, రూరల్ ఎస్ఐ శ్రీహరి, చేబ్రోలు ఎస్ఐ వీరనారాయణ, రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోగ నిరోధక శక్తికి తల్లిపాలే రక్షణ

రెంటచింతల ఆగస్టు 1 వార్త సాక్ష్యం



నవజాత శిశువులకు కాన్పు అనంతరం తల్లి ఇచ్చే తొలి పాలు (ముర్రుపాలు) బిడ్డకు మొదటి వ్యాక్సిన్‌లా పనిచేసి రోగనిరోధక శక్తిని పెంచుతాయని రెంటచింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రదీప్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముర్రుపాలలో ముఖ్యంగా IgA వంటి యాంటీబాడీలు పుష్కలంగా ఉండటంతో బ్యాక్టీరియా, వైరస్‌ల నుంచి శిశువుకు రక్షణ లభిస్తుందన్నారు. తల్లి పాలు తాగే పిల్లల్లో విరేచనాలు, వాంతులు, న్యుమోనియా, చెవి ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం గణనీయంగా తగ్గుతుందని వివరించారు.అలాగే తల్లిపాలు పిల్లల మెదడు, శరీరక ఎదుగుదలకు అవసరమైన పోషకాలను అందించడంతో పాటు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయని తెలిపారు. భవిష్యత్తులో ఊబకాయం, అలర్జీలు, మధుమేహం వంటి సమస్యల ముప్పును కూడా తగ్గించడంలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) మార్గదర్శకాల ప్రకారం, శిశువు పుట్టిన తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఈ సమయంలో మంచినీరు కూడా అవసరం లేదని సూచించారు. పాలిచ్చే తల్లులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఒత్తిడికి దూరంగా, ఆరోగ్యంగా ఉండాలని డాక్టర్ ప్రదీప్ కుమార్ రెడ్డి సూచించారు.

# వైసీపీ తీరుపై యరపతినేని ఆగ్రహం

పిడుగురాళ్ల ఆగస్టు 1 వార్త సాక్ష్యం



పిడుగురాళ్ల మండలం పందిటివారిపాలెం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే కార్యక్రమంలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి మాట్లాడే భాషను ప్రజలందరూ గమనించాలని అన్నారు. వైసీపీ పాలనలో గంజాయి, కిడ్నాప్, లిక్కర్, భూ కుంభకోణాలు వంటి పలు కేసుల్లో ఆ పార్టీ నేతలు అరెస్టవుతున్నారని ఆరోపించారు. శ్రీకాకుళం నుంచి రాష్ట్రం చివరి వరకు రోజుకో నాయకుడు ఏదో ఒక కేసులో అరెస్టవుతున్న పరిస్థితి నెలకొందని విమర్శించారు.మాజీ మంత్రి, ఆయన కుమారులకు సంబంధించిన లిక్కర్, రవాణా కేసులతో పాటు గుంటూరు వన్ మాజీ ఎమ్మెల్యే ముస్తఫా కుమారుడిపై నమోదైన కిడ్నాప్ కేసును ఆయన ప్రస్తావించారు. ఈ పరిణామాలు చూస్తుంటే వైసీపీ పూర్తిగా క్రిమినల్ నేపథ్యం కలిగిన పార్టీగా మారిందని ఆరోపించారు.మహిళలు, కుటుంబ సభ్యుల పట్ల వైసీపీ నాయకులు ఉపయోగించే భాష అత్యంత అభ్యంతరకరంగా ఉందని, సోషల్ మీడియాలో వారి వ్యవహార శైలి హద్దులు దాటుతోందని మండిపడ్డారు. మూడు దశాబ్దాలుగా రాజకీయాలను చూస్తున్నామని, కుటుంబ సభ్యులనే గౌరవించలేని వ్యక్తులు సమాజంలోని ఇతరుల పట్ల ఎలా వ్యవహరిస్తారో ప్రజలు ఆలోచించాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# వినూత్న నిరసన చేపట్టిన కాసు మహేష్

గురజాలఆగస్టు 1 వార్త సాక్ష్యం

గురజాల నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కొబ్బరికాయ కొట్టి అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు సద్బుద్ధి ప్రసాదించాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ, ధర్మాన్ని కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతు న్నారని ఆరోపించారు. తిరుమల దర్శన టికెట్ల విక్ర యాల నుంచి లిక్కర్, గంజాయి, మైనింగ్, పేకాట క్లబ్‌ల వరకు నియోజకవర్గంలో అక్రమాలు జరుగుతున్నాయని విమర్శిం చారు.అభివృద్ధి, సంక్షేమం పేరుతో ప్రజల నుంచి ఓట్లు పొంది అధికారంలోకి వచ్చిన నాయకులు ప్రజా విశ్వాసాన్ని నిలబెట్టు కోవడంలో విఫలమయ్యారని అన్నారు. ఇటువంటి పరిస్థితులు మారాలంటే దేవుడే మార్గం చూపా లని భావించి శ్రీ వేంకటేశ్వరస్వామి సాక్షిగా కొబ్బరికాయ కొట్టి నిరసన తెలిపినట్లు పేర్కొన్నారు.



ఈ వ్యాఖ్యలు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేసిన ఆరోపణలుగా పేర్కొన్నారు.

## సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో జరిగే పాదయాత్ర, జీబుజాతను జయప్రదం చేయండి



ఆత్మకూరు ఆగస్టు1 వార్త సాక్ష్యం

పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో శనివారం ఆత్మకూరు సిపిఐ తాలూకా కార్యదర్శి టి. ప్రతాప్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆత్మకూరు, నందికొట్కూరు నియోజకవర్గ మండలాలు కొత్తపల్లి, పాము లపాడు, జూపాడుబంగ్లా, పగిడ్యాల, మిడుతూరు మండలాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు అధ్యక్షతన ప్రారంభించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, కార్యవర్గ సభ్యులు వి. రఘురాం మూర్తి లు హాజరయ్యారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం సిపిఐ పార్టీ ముఖ్య నేతలు మాటా ్లడుతూ ఈనెల 8,9,10 తేదీలలో పాదయాత్ర శ్రీశైలం నియోజకవర్గం మరియు నందికొట్కూరు నియోజకవర్గ మండలాలలో పాదయాత్ర మరియు జీబు జాతరను 15 వరకు పూర్తి చేసుకొని ఆగస్టు 17వ తేదీనా పాదయాత్ర మరియు జిబుజాతాలో వచ్చిన సమస్యలపై కలెక్టరేట్ ముట్టడిస్తామని జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరాయంగా పోరాడుతూ ప్రజల పక్షాన నిలబడే ఏకైక పార్టీ ఏదైనా ఉందంటే అది ఎర్రజెండా పార్టీ ఏ అని అన్నారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు పట్టణ సిపిఐ కార్యదర్శి శ్రీనివాసులు, సిపిఐ కొత్తపల్లి మండల కార్యదర్శి కేతన్ వెంకట శివుడు, పాములపాడు మండల కార్యదర్శి సుధాకర్, కేజీ రోడ్డు హమాలి యూనియన్ నాయకులు చాంద్ బాషా, లల్లు, సిబిఐ పట్టణ కార్యదర్శి హమ్మద్ హుస్సేన్, ఆత్మకూరు ఏఐటిసి అధ్యక్ష కార్యదర్శులు దూద్ పీరా, ఏ.బిసన్న,మక్బుల్ భాష, మజీద్ మియా, ఏసేపు, శివ నారాయణ, మహిళా సమైక్య సంఘం నాయకురాలు మృతు జాబి, లక్ష్మీ రత్నమ్మ, రాణమ్మ, జబులమ్మ తదితరు లు పాల్గొన్నారు.

## ప్రముఖ జర్నలిస్టు యెండ్లూరి శ్రీనివాసరావు కన్నుమూత

-గుండెపోటుతో మృతి.. ఆదివారం అంతిమయాత్ర,...

వినుకొండ ఆగస్టు 1 వార్త సాక్ష్యం



వినుకొండ ప్రాంతానికి చెందిన ప్రముఖ జర్నలిస్టు, వినుకొండ వార్త ఎడిటర్ యెండ్లూరి శ్రీనివాసరావు ఆకస్మిక మరణం జర్నలిస్టు వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. శనివారం గుంటూరులోని తన నివాసంలో ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుప్ప కూలారు. వెంటనే కుటుంబ సభ్యులు సమీప ఆసుపత్రికి తరలిం చగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు.యెండ్లూరి శ్రీనివాసరావు గతంలో ఆంధ్రప్రభ, సూర్య దినపత్రికల్లో జర్నలిస్టుగా సేవలందించారు. అనంతరం వినుకొండ వార్త ఎడిటర్‌గా కొనసాగుతూ స్థానిక సమస్యలు, ప్రజా అంశాలపై విశేష కృషి చేశారు. ఆయన మరణవార్త తెలిసి పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, సామాజికవేత్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, ఆదివారం మధ్యాహ్నం వినుకొండ పట్టణంలోని సీతారామ టవర్స్ నుంచి శ్రీనివాసరావు అంతిమయాత్ర ప్రారంభమై, అనంతరం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయన మరణం జర్నలిజం రంగానికి తీరని లోటని సహచర పాత్రికేయులు పేర్కొన్నారు.

## ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్క్: కలెక్టర్



గుంటూరు,ఆగస్టు 1 వార్త సాక్ష్యం

జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డ×ఖజఖ) సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పొన్నూరు మినహా అన్ని నియోజకవర్గాల్లో భూములు గుర్తించి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో 11 ఎంఎస్ఎంఈ సంస్థలకు పెట్టుబడి, వడ్డీ, విద్యుత్, సాంకేతిక అప్‌గ్రేడేషన్ కింద రూ.1.53 కోట్ల రాయితీకి ఆమోదం తెలిపారు. అలాగే సింగిల్ డెస్క్ పోర్టల్‌లో వచ్చిన 55 దరఖాస్తుల్లో 24 దరఖాస్తులను నిర్ణీత గడువులో ఆమోదించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 2 ఆగష్టు 2026

## స్వచ్ఛమైన ఓటరు జాబితాకు రాజకీయ పార్టీల సహకారం కోరిన డీఆర్ఓ



గుంటూరుఆగస్టు 1 వార్త సాక్ష్యం ,

డ్రాఫ్ట్ ఓటరు జాబితాలోని తప్పులు, లోపాలను సరిదిద్దుకునేందుకు నెలరోజుల పాటు లభించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి రాజకీయ పార్టీలు, ఓటర్లను కోరారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా, అనర్హుల పేర్లు తొలగించేలా రాజకీయ పార్టీలు ఎన్నికల అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పేర్ల చేర్పు, తొలగింపు, సవరణలు, చిరునామా మార్పులకు సంబంధించిన దరఖాస్తులను గడువులోగా సమర్పించాలని సూచించారు. ప్రతి నియోజకవర్గానికి 20 మంది అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారులను నియమించి క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన చేపడతామని తెలిపారు. అక్టోబర్ 3 నాటికి స్వచ్ఛమైన, పారదర్శకమైన ఓటరు జాబితా సిద్ధం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ, బీజేపీ, జనసేన, వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్, బీఎస్పీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధులు పాల్గొని పలు సూచనలు చేశారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం




పల్నాడు, ఆగస్టు 1 వార్త సాక్ష్యం :

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నరసరావుపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 100 మంది గర్భిణులు, బాలింతలతో తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతిజ్ఞ చేయించారు. బిడ్డ పుట్టిన తొలి గంటలోనే తల్లిపాలు ఇవ్వాలని, తొలి ఆరు నెలలు తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారమని ఎమ్మెల్యే తెలిపారు. తల్లిపాలు శిశువుకు రోగనిరోధక శక్తిని పెంచి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడతాయని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్యసేవలు, పౌష్టికాహారం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, మహిళా--శిశు అభివృద్ధి శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల తీరుపై విద్యార్థుల్లో అవగాహన



రెంటచింతల ఆగస్టు 1 వార్త సాక్ష్యం

ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రెంటచింతల మండల కేంద్రంలోని ఫాతిమా విద్యానికేతన్‌లో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్ ఏర్పాటు, ఓటర్ల జాబితా పరిశీలన, ఎడమ చేతికి సిరా గుర్తు వేయడం, ఓటరు స్లిప్పుల పంపిణీ, ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, పోలింగ్ సిబ్బంది విధులు, బ్యాలెట్ బాక్స్‌లో ఓటు వేయడం, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన, విజేతలు బాధ్యతలు చేపట్టే విధానం తదితర అంశాలను విద్యార్థులే ప్రత్యక్షంగా నిర్వహించి ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించుకున్నారు.. ఓటింగ్ ప్రక్రియలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. కార్యక్రమంలో విద్యాసంస్థ కరస్పాండెంట్ ఏరువ ఫాతిమా మర్రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు స్టెఫీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులకు బీజేపీ భరోసా

చీరాలఆగస్టు 1 వార్త సాక్ష్యం

భారతీయ చేనేతకు పూర్వవైభవం తీసుకురావడం, చేనేత కుటుంబాల సంక్షేమం, అభివృద్ధి, ఆత్మగౌరవ పరిరక్షణే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఆగస్టు 5న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న 'భారతీయ జనతా పార్టీ -- చేనేత సమ్మేళనం' కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రం, ఆహ్వాన పత్రికను శనివారం చీరాల రోటరీ క్లబ్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మువ్వల వెంకట రమణారావు, జిల్లా ఇన్‌చార్జి గాజుల వెంకయ్య నాయుడు, రాష్ట్ర నాయకులు పోతుల సురేష్, కొక్కిలిగడ్డ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు చేనేత ప్రతీక అని పేర్కొన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేయడం, చేనేత కార్మికులకు ప్రోత్సాహం కల్పించడం, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశమని వివరించారు. బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు కారంచేటి నగేష్ కుమార్, పామంజి రాంబాబు, డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ, ఆగస్టు 5న ఉదయం 8 గంటలకు విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి భారీ శోభాయాత్ర ప్రారంభమై, ఉదయం 9.30 గంటలకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో చేనేత సమ్మేళనం నిర్వహిస్తామని తెలిపారు. చేనేత కళాకా రులు, కార్మికులు, చేనేత సంఘాల నాయకులు, మహిళలు, యువత, విద్యార్థులు, మేధావులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో అరవపల్లి కుమార్, యార్లగడ్డ లక్ష్మీనారాయణ, క్షత్రియ సుహాసిని, జ్వాల నరసింహారావు, డి. కృష్ణ, ఏరాసు అరుణ్‌కుమార్, పోతుల ప్రకాష్, పింజల భరణిరావు, రావు జగదీష్, ఎక్కాల జగదీశ్, బూదాటి వెంకటేష్ కుమార్, కలవకూరి బసవేశ్వరరావు, శంకర్, చిట్టి నాగేశ్వర రావు, అవ్వరు హనుప్రసాద్, గౌరబతుని జయశం కర్‌తో పాటు బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.




## రఘురామపై సీబీఐకి ఫిర్యాదు చేసిన మాజీ ఐపీఎస్ పీవీ సునీల్ కుమార్

-వేల కోట్ల రూపాయల కేసుల్లో సాక్షులను రఘురామ బెదిరిస్తున్నారని ఆరోపణ

-రఘురామను అరెస్టు చేయాలంటూ బీఎన్ఎస్ఎస్ చట్టాన్ని ప్రస్తావించిన వైనం

-దర్యాప్తు సమగ్రతను కాపాడాలని సీబీఐ డైరెక్టర్‌కు విజ్ఞప్తి

ఆగస్టు 1 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై మాజీ సీఐడీ చీఫ్ పీవీ సునీల్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. రెండు కీలకమైన సీబీఐ కేసుల్లో సాక్షులను బెదిరిస్తూ, సాక్ష్యాధారాలను తారుమారు చేసేందుకు రఘురామ ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ ఆయన సీబీఐ డైరెక్టర్‌కు లేఖ రాశారు. ఈ వ్యవహారంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని, రఘురామపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (SFIO) కోరిన రికార్డుల విషయంలో రఘురామకృష్ణరాజు తనను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారని, తన ప్రాణాలకు ముప్పు ఉందని మాదల శ్రీనివాస్ అనే వ్యక్తి పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని సునీల్ కుమార్ తన ఫిర్యాదులో ప్రస్తావించారు. వేల కోట్ల రూపాయల ఆర్థిక నష్టానికి సంబంధించిన రెండు సీబీఐ కేసుల నేపథ్యంలో ఈ సంఘటనను అత్యంత తీవ్రంగా పరిగణించాలని ఆయన పేర్కొన్నారు. 2019లో నమోదైన కేసులో రూ.947.71 కోట్లు, 2021 నాటి మరో కేసులో రూ.237.84 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై రఘురామపై సీబీఐ కేసులు నమోదయ్యాయని సునీల్ కుమార్ తెలిపారు. ఈ కేసుల దర్యాప్తు కొనసాగుతుండగా, సాక్షులను ప్రభావితం చేయడం, రికార్డులను మాయం చేయడం వంటివి దర్యాప్తు సమగ్రతను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.కొత్తగా అమల్లోకి వచ్చిన భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (BNSS), 2023లోని సెక్షన్ 35 ప్రకారం.. సాక్షులను బెదిరించినా, సాక్ష్యాలను నాశనం చేసినా అరెస్టుతో సహా కఠిన చర్యలు తీసుకునే అధికారం దర్యాప్తు సంస్థలకు ఉందని సునీల్ కుమార్ తన లేఖలో స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో వెంటనే స్పందించకపోతే, ఇతర సాక్షులు కూడా భయపడి దర్యాప్తునకు సహకరించరని, ఇది దర్యాప్తు సంస్థల నిష్పాక్షికతపై ప్రజల్లో నమ్మకాన్ని తగ్గిస్తుందని హెచ్చరించారు. "న్యాయం జరగడమే కాదు, జరిగినట్లుగా కనిపించాలి" అని ఆయన ఉద్ఘాటించారు. ఈ ఘటనను పరిగణనలోకి తీసుకుని, సంబంధిత రికార్డులు, ఎలక్ట్రానిక్ ఆధారాలను భద్రపరచాలని, సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నం జరిగిందా అనే కోణంలో విచారణ జరపాలని, అవసరమైతే బీఎన్ఎస్ఎస్ చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సునీల్ కుమార్ సీబీఐని కోరారు. రఘురామపై ఈ కేసులు ఎంపీగా ఉన్నప్పుడు నమోదయ్యాయి. కాగా, వైసీపీ హయాంలో చంద్రబాబుతో పాటు ఇతర నేతలపై అవినీతి ఆరోపణలతో కేసులు నమోదు చేసిన సమయంలో సునీల్ కుమార్ సీఐడీ చీఫ్‌గా ఉన్నారు. 2024లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన్ను ప్రాధాన్యం లేని పోస్టుకు బదిలీ చేశారు. ఆ తర్వాత ఆయన సర్వీసు నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు.



# ఇంటింటికీ టీడీపీ: 14.60 లక్షల ఇళ్లను సందర్శించిన నేతలు- పర్యవేక్షిస్తున్న లోకేశ్

-ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన

-ఆరు రోజుల్లో 14.60 లక్షల ఇళ్లను సందర్శించిన కూటమి శ్రేణులు

-రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తున్న నేతలు

-కార్యక్రమ పురోగతిని సమీక్షిస్తూ శ్రేణులను అభినందించిన నారా లోకేశ్

-అవాంతరాలు ఎదురైనా కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగించడంపై హర్షం

ఆగస్టు 1 వార్త సాక్ష్యం

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'ఇంటింటికీ టీడీపీ -- 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి--సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవం తంగా కొనసాగుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమం ఆరో రోజుకు చేరుకుంది. గత ఆరు రోజుల్లో కూటమి శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 14.60 లక్షల ఇళ్లను సందర్శించి, ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించాయి. శనివారం ఒక్కరోజే కూటమి నాయకులు, కార్యకర్తలు సుమారు 2.60 లక్షల కుటుంబాలను కలిశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, అన్ని స్థాయిల నాయకులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఇంటిం టికీ వెళ్లి రైతు సంక్షే మం, మహిళా సాధి కారత, యువతకు ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం సాధించిన ప్రగతిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమ పురోగతిని తెలుగు దేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ఎప్పటికప్పుడు నియోజ కవర్గాల వారీగా సమీక్షిస్తు న్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతూ కార్యక్రమాన్ని మరింత సమర్థంగా నిర్వహిస్తున్నారు. భోగాపురం అంతర్జా తీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొనడం, కొన్ని ప్రాం తాల్లో వర్షాలు కురిసినప్పటికీ అత్యధిక చోట్ల కూటమి శ్రేణులు ఉత్సాహంగా పాల్గొనడంపై లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.



VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# ఎర్రబస్సు కూడా రాని భోగాపురానికి ఎయిర్‌బస్సు ఎందుకు? అని జగన్ ఎక్కడా అనలేదు: సజ్జల

-టీడీపీ నేతలు కావాలనే విషప్రచారం చేస్తున్నారన్న సజ్జల
-చిన్నారి అడిగిన మాటలనే జగన్ ప్రస్తావించారని వెల్లడి
-విమానాశ్రయం పనులు 80 శాతం వైసీపీ పాలనలోనే పూర్తయ్యాయన్న సజ్జల

ఆగస్టు 1 వార్త సాక్ష్యం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం విషయంలో అధికార తెలుగుదేశం పార్టీ నేతలు కావాలనే విషప్రచారం చేస్తున్నారని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. భోగాపురం విమానాశ్రయం అంశంపై వైసీపీని లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఘాటుగా స్పందించారు. వైసీపీ అధినేత జగన్ వ్యాఖ్యలను టీడీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తున్నారని సజ్జల ధ్వజమెత్తారు. ఎర్రబస్సు కూడా రాని భోగాపురానికి ఎయిర్‌బస్సు ఎందుకు? అని జగన్ ఎక్కడా అనలేదని... ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభించే సమయంలో ఓ చిన్నారి అడిగిన మాటలను మాత్రమే జగన్ ప్రస్తావించారని.. దాన్ని అధికార పార్టీ నేతలు తప్పుగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గతంలో చంద్రబాబు కేవలం ఒక నల్లరాయిని తెచ్చి హడావుడిగా శంకుస్థాపన చేసి సరిపెట్టారని సజ్జల విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే భూసేకరణ, పరిహారం చెల్లింపులు, కీలక అనుమతులన్నింటినీ క్లియర్ చేసి శరవేగంగా పనులు జరిపించామని గుర్తు చేశారు. ఎయిర్‌పోర్టుకు సంబంధించిన 80 శాతం పనులు వైసీపీ పాలనలోనే పూర్తయ్యాయని, మిగిలిన కొద్దిపాటి పనులను మాత్రమే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. కష్టమంతా ఒకరు చేస్తే ఆ క్రెడిట్ మొత్తాన్ని చంద్రబాబు చోరీ చేయడానికి ప్రయత్నిస్తున్నారని... ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా మిగిలిన పనులను పూర్తి చేయాల్సిందే కదా అని అన్నారు. భోగాపురం విమానాశ్రయం సాకారమవ్వడంలో నాటి జగన్ ప్రభుత్వ కృషి అత్యంత కీలకమైనదని సజ్జల స్పష్టం చేశారు.



# ఉరకలెత్తుతున్న గోదావరి- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

-గోదావరి నదికి పెరుగుతున్న వరద ఉధృతి
-ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
-బ్యారేజీ వద్ద 10 లక్షల క్యూసెక్కులు దాటిన ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో
-భద్రాచలం వద్ద 56 అడుగుల వద్ద కొనసాగుతున్న నీటిమట్టం
-లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచన

ఆగస్టు 1 వార్త సాక్ష్యం

గోదావరి నదికి వరద ఉధృతి అంతకంతకూ పెరుగుతోంది. ఎగువ రాష్ట్రాలు, పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నది మహోగ్ర రూపాన్ని దాల్చుతోంది. భద్రాచలం వద్ద నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరడంతో, దాని ప్రభావం ఆంధ్రప్రదేశ్‌లోని ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీపై స్పష్టంగా కనిపిస్తోంది. బ్యారేజీ వద్ద వరద ప్రవాహం 10 లక్షల క్యూసెక్కులు దాటడంతో, జలవనరుల శాఖ అధికారులు శనివారం ఉదయం మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. జలవనరుల శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం, శనివారం ఉదయం 10 గంటల సమయానికి ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 11.75 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం బ్యారేజీలోకి 10.01 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, అంతే మొత్తంలో నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో గోదావరి హెడ్ వర్క్స్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అధికారికంగా మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేసి, క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశారు. మరోవైపు, తెలంగాణలోని భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపంతో ప్రవహిస్తోంది. అక్కడ నీటిమట్టం ఇప్పటికే 56 అడుగులకు చేరుకోవడంతో మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. భద్రాచలం నుంచి భారీగా నీటిని దిగువకు విడుదల చేస్తుండ టంతో, ధవళేశ్వరం వద్ద ప్రవాహం మరింత పెరగను ంది. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) గోదావరి పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసింది. ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాల్లోని లంక గ్రామాలు, నదీ తీరంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించింది. అధికార యంత్రాంగం జారీచేసే సూచనలను పాటిస్తూ, ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. సహాయక చర్యల కోసం అధికార యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉంది.




# శ్రీశైలం అడవుల్లో పులి మృతిపై విచారణకు ఆదేశించిన పవన్

-అది సహజ మరణమా? లేక కుట్ర జరిగిందా? అనే కోణంలో దర్యాప్తు చేయాలని సూచన
-అటవీ ప్రాంతాల్లో పెట్రోలింగ్, క్షేత్రస్థాయిలో నిఘా పెంచాలని అధికారులకు కీలక ఆదేశాలు
-నల్లమల అడవుల్లో బుధవారం తొమ్మిదేళ్ల ఆడపులి మృతదేహాన్ని గుర్తించిన సిబ్బంది
-పులి శరీరంపై ఎలాంటి గాయాలు లేవన్న అటవీ అధికారులు

ఆగస్టు 1 వార్త సాక్ష్యం

నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్‌లో (ఎన్ఎస్‌టీఆర్) ఆడపులి మృతి చెందిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పర్యావరణ-అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ విచారణకు ఆదేశించారు. ఈ ఘటన తన దృష్టికి వచ్చిందని, ప్రకృతి సమతుల్యతకు పులుల సంరక్షణ అత్యంత కీలకమని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఒక్క పులి ప్రాణం కోల్పోవడం కూడా తీవ్రంగా పరిగణించాల్సిన విషయమని, మన అడవులను, వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యతను ఈ ఘటన గుర్తు చేస్తోందని అన్నారు. ఈ మృతి వెనుక ఉన్న కారణాలను నిగ్గు తేల్చేందుకు సమగ్రంగా, పారదర్శకంగా విచారణ జరపాలని ఎన్ఎస్‌టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్‌ను ఆదేశించినట్లు పవన్ తెలిపారు. "ఇది సహజ మరణమా? లేక వేట, విష ప్రయోగం వంటి మానవ తప్పిదాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణాల్లో క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలి. వన్యప్రాణి సంరక్షణ నిబంధనల ప్రకారం పోస్ట్‌మార్టం, ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించి అసలు కారణాలు తెలుసుకోవాలి" అని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అటవీ ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను వెంటనే పెంచాలని, క్షేత్రస్థాయిలో నిఘాను పటిష్ఠం చేయాలని అటవీ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనలో ఎవరిదైనా నిర్లక్ష్యం ఉందని తేలితే కఠినమైన చర్యలు తప్పవని, అటవీ, వన్యప్రాణి సంరక్షణకు సంకీర్ణ ప్రభుత్వం కట్టుబడి ఉందని హెచ్చరించారు. నల్లమల అటవీ ప్రాంతంలో బుధవారం తొమ్మిదేళ్ల ఆడపులి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆత్మకూరు, నాగలూటి ఫారెస్ట్ రేంజ్‌ల సరిహద్దులోని ఇసుక మడుగు వద్ద గస్తీ నిర్వహిస్తున్న సిబ్బంది పులి మృతదేహాన్ని గుర్తించారు. జాతీయ పులుల సంరక్షణ అథారిటీ నిబంధనల ప్రకారం గురువారం పోస్ట్‌మార్టం పూర్తి చేశారు. పులి శరీరంపై ఎలాంటి బాహ్య గాయాలు లేవని, అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదని అధికారులు ప్రాథమికంగా తెలిపారు.



# గోళ్లపాడులో బాలాజీ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

పల్నాడు, ఆగస్టు 1 వార్త సాక్ష్యం

సత్తెనపల్లి నియోజకవర్గం ముప్పాళ్ల మండలం గోళ్లపాడులో నూతనంగా నిర్మించిన బాలాజీ ఫిల్లింగ్ స్టేషన్‌ను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జు నరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ నియోజకవర్గాల టీడీపీ నాయకులు, ప్రజాప్రతిని ధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బాలల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

-జిల్లా ప్రధాన న్యాయమూర్తి,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వీరయ్య

మంచిర్యాల జిల్లా ఆగస్టు 1 వార్త సాక్ష్యం :



బాలల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వీరయ్య అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,డి.సి.పి. ఎ.భాస్కర్,జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,అదనపు సీనియర్ సివిల్ జడ్జి- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రామ్ మోహన్ రెడ్డి,అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ కె.నిరోషా,స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ ఫస్ట్ క్లాస్ (ఎక్సైజ్) బి. కృష్ణ తేజ,జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్,మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త సత్తయ్య లతో కలిసి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ, పోక్సో చట్టంపై ఏర్పాటు చేసిన ఒక్కరోజు అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో బాలల హక్కుల పరిరక్షణ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో విపరీతమైన పోకడలతో చిన్న వయసులోనే దారి తప్పుతున్నారని, సోషల్ మీడియా ప్రభావం సమాజంపై పడి పిల్లలలో సైతం చెడు ప్రవర్తన కలుగుతుందని తెలిపారు. పిల్లలకు వారి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలని,చెడు వ్యసనాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించాలని, సమాజం పట్ల బాధ్యతలను తెలియజేయాలని అన్నారు.సమ సమాజ స్థాపనలో గురువుల పాత్ర అనిర్వచనీయమైనదని,పిల్లలు,కళాశాల యువత మద్యపానం, మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉపాధ్యాయులు, అధ్యాపకులు బాధ్యతగా వారిని సన్మార్గంలో నడిచే విధంగా తీర్చిదిద్దాలని తెలిపారు.పిల్లల హక్కుల పరిరక్షణ కోసం స్పెషల్ జువైనల్ పోలీస్ యూనిట్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... చిన్నతనంలోనే మంచి అలవాట్లు పిల్లలకు నేర్పించాలని, గుడ్ టచ్-బాడ్ టచ్ పై అవగాహన కల్పించాలని తెలిపారు. పిల్లలకు వారి హక్కుల గురించి వివరించడం జరుగుతుందని,జె జె, పోక్సో చట్టాలపై పిల్లలకు,వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామని,బాల కార్మికులను రక్షించి వారికి నిర్బంధ విద్య అందిస్తున్నామని తెలిపారు.లైంగిక వేధింపులు,దాడులకు గురైన బాధితులను గుర్తించడం, బాధితులకు చట్టాలపై అవగాహన కల్పించడం, బాలలపై దాడులకు పాల్పడిన వారిని గుర్తించి కేసులు నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు.డి.సి.పి.మాట్లాడుతూ...దేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మించబడుతుందని, బాలల హక్కులను రక్షించడం బాధ్యతగా తీసుకోవాలని, బాలలను సన్మార్గంలో నడిపిం చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. షీ టీమ్స్ ఆధ్వర్యంలో బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని, భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులకు న్యాయం చేయడం జరుగుతుందని, సోషల్ మీడియాలో వచ్చే అసాంఘిక అంశాలను నిరోధించి పిల్లలు చూడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికా రులు, బాలల హక్కుల పరిరక్షణ సమితి అధికారులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వేధింపులు సహించవద్దు..షీ టీమ్స్‌ను ఆశ్రయించండి



మందమర్రి ఆగస్టు 1 వార్త సాక్ష్యం :

మహాత్మ జ్యోతి బాపూలే తెలంగాణ బిసి గురుకుల పాఠశాల,కళాశాల (బాలికలు) మందమర్రి షీ టీమ్ పోలిసుల పిలుపు.మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఎస్ఐ హైమ మహిళా భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమం శనివారం నిర్వహించారు.మందమర్రి లోని మహాత్మా జ్యోతి బాపూలే తెలంగాణ బిసి గురుకుల పాఠశాల,కళాశాల బాలికల కు షీ టీమ్ సిబ్బంది మహిళల కోసం అమలు చేస్తున్న భద్రతా చర్యలు, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు,మానవ అక్రమరవాణా,ట్రాఫిక్ నియమాలు, టి-సేఫ్ యాప్,షీ టీమ్స్ సేవల గురించి సమగ్రంగా వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచిస్తూ, హెల్ప్‌లైన్ నంబర్లు డయల్ 100,రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700,మంచిర్యాల జిల్లా షీ టీమ్ నంబర్ 8712659385లను తెలియజేశారు.సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.తెలంగాణ ప్రభు త్వం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రవ్యాప్తంగా పటిష్ట చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.మహిళలు ఎటువంటి వేధింపులకు గురైనా భయపడకుండా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా షీ టీమ్ సిబ్బంది కానిస్టేబుళ్లు శ్రవణ్, శ్రీలత, ప్రిన్సిపాల్ మంజుల,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A9153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# బిజినెస్

## కో-లొకేషన్ కేసులో సెబీకి ఎన్ఎస్ఈ రూ.1,500 కోట్ల చెల్లింపు

**ముంబై:**
చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కో-లొకేషన్ కేసులను పరిష్కరించుకునేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) రూ.1,491.21 కోట్లు చెల్లించనుంది. క్యాపిటల్ మార్కెట్ చరిత్రలో ఇప్పటివరకిదే అతిపెద్ద సెటిల్‌మెంట్. కేసుల పరిష్కారం కోసం సవరించిన ఆఫర్‌ను అంగీకరిస్తున్నట్లు సెబీ జూలై 30న తమకు సమాచారం అందించిందని ఎన్ఎస్ఈ తెలిపింది. దీంతో ఎన్ఎస్ఈ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) సాఫీగా పూర్తయ్యేందుకు వీలు కలగనుంది. ఐపీఓ ద్వారా రూ.30,000 కోట్ల సమీకరణ కోసం ఎన్ఎస్ఈ ఇప్పటికే ముసాయిదా పత్రాలను సెబీకి సమర్పించింది.ఆర్టీఐ చట్టం కేసులో ఎన్ఎ?సఈకి తాత్కాలిక ఊరట: ఎన్ఎ?సఈ సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం పరిధిలోకి వస్తుందన్న కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. సీఐసీ ఆదేశాలను సవాలు చేస్తూ ఎన్ఎ?సఈ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపేందుకు అంగీకరించిన జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాల ధర్మాసనం.. ఈ విషయంపై 4 వారాల్లో స్పందించాలని సీఐసీతో పాటు ఇతరులను కోరింది. స్టాక్ ఎక్స్ఛేంజీలు ప్రజల లావాదేవీలను నిర్వహిస్తాయి కాబట్టి వీటిని కూడా ఆర్టీఐ చట్టం పరిధిలోకి వచ్చే ప్రజా సంస్థలుగానే పరిగణించబడతాయని సీఐసీ 2007లో ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో ఎన్ఎ?సఈ అప్పట్లోనే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కానీ, ఈ జూలై 1న న్యాయస్థానం సీఐసీకి అనుకూలంగా తీర్పునివ్వడంతో ఎన్ఎస్ఈ.. సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.



## అత్యవసర, తక్షణ వైద్య సరఫరాల కోసం నిలువుగా ఎగిరే ఈ-విమానాలు



**ముంబై:**
దేశంలో అత్యవసర, తక్షణ వైద్య సరఫరాల కోసం రన్‌వే అవసరం లేకుండా నిలువుగా ఎగిరే, దిగే ఎలక్ట్రిక్ విమానాల (ఈవీటీఓఎల్)ను వినియోగించే దిశగా ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇందుకు సాధ్యాసాధ్యాలపై ఉమ్మడిగా అధ్యయనం చేసేందుకు జపాన్‌కు చెందిన ఈవీటీఓఎల్‌ల అభివృద్ధి, తయారీ సంస్థ స్కైడ్రైవ్‌తో పాటు సుజుకీ మోటార్ కార్పొరేషన్‌తో ఎయిరిండియా అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చు కుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా స్కైడ్రైవ్ ఈవీటీఓఎల్ సాంకేతికతను, ఎయిరిండియా విమానాల నిర్వహణ నైపుణ్యాన్ని, సుజుకీ మార్కెట్ అనుభవాన్ని ఉపయోగించుకొని ఎమర్జెన్సీ మెడికల్ లాజిస్టిక్స్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేయనున్నాయి. దేశంలోని ప్రధాన నగరాలతో పాటు చిన్న నగరాల రోడ్లు కూడా అత్యంత రద్దీగా మారుతున్న నేపథ్యంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని వైద్యం కోసం దూర ప్రాంతాలకు తరలించడం లేదా కీలక ఔషధాల చేరవేత అత్యంత సవాలుగా మారింది. ఈవీటీఓఎల్‌ల వినియోగం ఈ సవాలును అధిగమించేందుకు దోహదపడనుంది.

## హోటళ్లు, రెస్టారెంట్లకు ఊరట- భారీగా తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర




హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ సంస్థలకు కేంద్రం ఊరటనిచ్చింది. 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరను ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీలు) రూ.200కుపైగా తగ్గించాయి. తాజా ధరలు అమల్లోకి వచ్చాయి. అయితే గృహ వినియోగదారులు ఉపయోగించే 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు. తాజా సవరణ ప్రకారం ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్‌పై రూ.202, కోల్‌కతాలో రూ.209 వరకు తగ్గింది. దీంతో కోల్‌కతాలో ఒక్కో వాణిజ్య సిలిండర్ ధర రూ.2 ,872.50కు చేరింది. హైదరాబాద్‌లో రూ.206 తగ్గి రూ.2,985గా ఉంది. ఇతర ప్రధాన నగరాల్లో కూడా దాదాపు ఇదే పరిధిలో ధరలు తగ్గించినట్లు ఓఎంసీలు వెల్లడించాయి. ఈ నిర్ణయంతో హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న వ్యాపార సంస్థలపై ఇంధన భారం కొంత తగ్గనుంది. ఇటీవల పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయ ఇంధన ధరలు పెరగడంతో వాణిజ్య ఎల్పీజీ ధరలు పలుసార్లు పెరిగాయి. ఇప్పుడు ప్రపంచ ఇంధన మార్కెట్లు క్రమంగా స్థిరపడుతుండటంతో ఓఎంసీలు ధరలను తగ్గించాయి. అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా ఎల్పీజీ ధరలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయి. గత నెల జులై 1న కూడా 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.183.50 వరకు తగ్గించారు. వరుసగా రెండో నెలా ధరలు తగ్గడంతో వ్యాపార వర్గాలు ఊరట వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు లేకపోవడం గృహ వినియోగదారులకు నిరాశ కలిగిస్తోంది.

## కామన్వెల్త్ గేమ్స్: భారత్ ఖాతాలో మరో రెండు పసిడి పతకాలు




**స్పోర్ట్స్ డెస్క్:**
గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్ ఖాతాలో మరో రెండు స్వర్ణాలు చేరాయి. ఇవాళ బాక్సింగ్ విభాగంలో భారత్ ఈ రెండు పసిడి పతకాలను సాధించింది. తొలుత మహిళల 54 కేజీల విభాగంలో ప్రీతి పవార్ గోల్డ్ మెడల్ గెలిచింది. తుదిపోరులో కెనడాకు చెందిన స్కార్లెట్ సవన్నా డెల్గాడోను ప్రీతి చిత్తుగా ఓడించింది. అనంతరం మహిళల 57 కేజీల విభాగంలో జైస్మిన్ లాంబోరియా భారత్ కు పసిడిని అందించింది. ఫైనల్ లో నార్తర్న్ ఐర్లాండ్ కు చెందిన మైఖేలా వాల్ష్ పై జైస్మిన్ విజయం సాధించింది.భారత మహిళా బాక్సర్ ప్రీతి పవార్ మహిళల 54 కేజీల విభాగంలో స్కార్లెట్ సవన్నాపై సునాయాసంగా గెలుపొందింది. తొలి బౌట్ నుంచి ప్రీతి ప్రత్యర్థిపై పంచ్‌లతో విరుచుకుపడింది. ఇక రెండో బౌట్‌లోనూ ప్రీతి స్కార్లెట్ ముఖంపై పంచుల వర్షం కురిపించి ఆధిక్యంలో నిలిచింది. ఇక మూడో బౌట్‌లోనూ తనదైన శైలిలో విరుచుకుపడ్డ ప్రీతి పవార్‌ను యునానిమస్ విజయం సాధించినట్లు అంపైర్లు ప్రకటించారు.ఇప్పటికే బాక్సింగ్ విభాగం నుంచి కనీసం 10 పతకాలు ఖాయమైన సంగతి తెలిసిందే. ఇక మహిళల 57 కేజీల విభాగంలో జాస్మిన్ లంబోరియా కూడా స్వర్ణం కైవసం చేసుకుంది. కామన్‌వెల్త్‌లో భారత్‌కు ఇది ఏడో స్వర్ణం కాగా, ఓవరాల్‌గా 25వ పతకం.ఇక పురుషుల ట్రిపుల్ జంప్ విభాగంలో భారత అథ్లెట్లు మెరిశారు. ప్రవీణ్ చిత్రావేల్ 16.58 మీటర్ల ఎత్తు ఎగిరి రజతం సాధించాడు. మరో అథ్లెట్ సెల్వ ప్రభు 16.52 మీటర్ల ఎత్తు ఎగిరి కాంస్య పతకం అందుకున్నాడు. దీంతో భారత్ మొత్తం పతకాల సంఖ్య 27కు చేరుకుంది. ఇందులో 7 స్వర్ణాలు, 13 రజతాలు, 7 కాంస్యాలు ఉన్నాయి.

## భవిష్యత్తులో వైభవ్ సూర్యవంశీ కెప్టెన్ అవుతాడేమో: ఈస్ట్ జోన్ సెలెక్టర్




**ఇంటర్నెట్ డెస్క్:**
దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ జట్టుకు భారత యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడంపై వస్తోన్న విమర్శలకు ఆ జట్టు సెలెక్టర్ ప్రవంజన్ మల్లిక్ సమాధానమిచ్చారు. జట్టు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. వైభవ్ భవిష్యత్తులో కెప్టెన్ కూడా అవుతాడని అభిప్రాయపడ్డారు. స్టార్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా వ్యవహరించనున్న ఈస్ట్ జోన్ జట్టుకు వైభవ్ వైస్ కెప్టెన్‌గా ఎంపికైన సంగతి తెలిసిందే. అయితే 15 ఏళ్ల వయసులోనే ఇంత పెద్ద బాధ్యత ఇవ్వడం సరైన నిర్ణయం కాదంటూ సోషల్ మీడియాలో పలువురు మాజీ క్రికెటర్లు, అభిమానులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.వైభవ్‌ను కెప్టెన్‌గా నియమించలేదు. వైస్ కెప్టెన్ మాత్రమే. కెప్టెన్ ఇషాన్ కిషన్ వికెట్ కీపర్ కావడంతో రోజంతా మైదానంలో చురుకుగా ఉంటాడు. వైభవ్ మొత్తం మ్యాచ్‌కు నాయకత్వం వహించాల్సిన పరిస్థితి ఉండదు. చిన్న వయసులోనే బాధ్యతలు ఇవ్వడం అతడిని మరింత పరిణతి చెందిన ఆటగాడిగా తీర్చిదిద్దుతుంది. దేశం కోసం బాగా ఆడాలనే తపన వైభవ్‌లో ఉంది. యువ ఆటగాళ్లకు బాధ్యతలు అప్పగించడం చాలా ముఖ్యం. అందుకే ఈ అవకాశాన్ని కల్పించాం. వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తులో కెప్టెన్ అవుతాడేమో! అతడి ప్రతిభ అసాధారణం. వైభవ్ ఇప్పటికే బిహార్ ఫస్ట్‌క్లాస్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాన్ని చెప్పే హక్కు ఉంది. వాటిని మేము గౌరవిస్తాం. అయితే జట్టుకు ఏది మంచిదో అదే చేశాం. ఇది సెలక్షన్ కమిటీ సభ్యులందరూ కలిసి తీసుకున్న నిర్ణయం' అని ప్రవంజన్ స్పష్టం చేశారు.కాగా కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఈస్ట్ జోన్ సెలక్షన్ కమిటీ సమావేశంలో ప్రవంజన్ మల్లిక్‌తో పాటు దిబ్యేందు చక్రవర్తి, మనీష్ వర్ధన్, అలోక్ సాహా, అనంత్ ప్రకాశ్ పాల్గొన్నారు. అయితే ఆగస్టు 23 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఈ దులీప్ ట్రోఫీ జరగనుంది. కాగా ఈస్ట్ జోన్ జట్టు తన తొలి మ్యాచ్‌ను నార్త్ జోన్‌తో ఆడనుంది.

# స్పోర్ట్స్

## నీరజ్ చోప్రా తదుపరి జావెలిన్ ఈవెంట్ ఎప్పుడంటే




**స్పోర్ట్స్ డెస్క్:**
భారత స్టార్ జావెలిన్ త్రోయర్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా కామన్వెల్త్ గేమ్స్‌లో అద్భుత ప్రదర్శనతో రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. శుక్రవారం జరిగిన ఫైనల్లో తన రెండో ప్రయత్నంలో ఈ సీజన్ అత్యుత్తమ త్రోగా 85.83 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు. లంక అథ్లెట్ రుమేశ్ తరంగ పతిరాగే పసిడి పతకం సాధించగా, భారత్‌కే చెందిన యశ్ వీర్ సింగ్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు.గతేడాది సెప్టెంబర్ నుంచి దిగువ వీపు గాయంతో బాధపడుతున్న నీరజ్ చోప్రా, సుదీర్ఘ పునరావాస శిక్షణ తర్వాత ఈ ఏడాదితో కలుపుకొని బరిలోకి దిగడం ఇది రెండోసారి మాత్రమే. జూన్‌లో జరిగిన దోహా డైమండ్ లీగ్‌లో నాలుగో స్థానంలో నిలిచిన నీరజ్, ఆ తర్వాత రబత్, రోమ్ లీగ్‌లకు దూరంగా ఉంటూ తుర్కియేలో కోలుకున్నాడు. గాయం ప్రభావం ఇంకా ఉన్నప్పటికీ, క్రమంగా పూర్వపు ఫామ్‌ను అందుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు నీరజ్ తెలిపాడు.

**-నీరజ్ చోప్రా తదుపరి షెడ్యూల్:**

ఈ పతకం తర్వాత నీరజ్ చోప్రా దృష్టి తదుపరి అంతర్జాతీయ టోర్నీలపై పడింది.
ఆగస్టు 21: లాసాన్ డైమండ్ లీగ్
ఆగస్టు 27: జ్యూరిచ్ డైమండ్ లీగ్
సెప్టెంబర్ 4-5: బ్రస్సెల్స్‌లో జరగబోయే డైమండ్ లీగ్ ఫైనల్స్
సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్‌లోని ఐచి నాగోయా వేదికగా జరగనున్న ఆసియా గేమ్స్‌కు ముందు ఈ డైమండ్ లీగ్ పోటీల్లో పాల్గొని తన ఫిట్‌నెస్‌ను మరింత మెరుగుపరచుకోవాలని నీరజ్ భావిస్తున్నాడు. ప్రస్తుతం డైమండ్ లీగ్ పాయింట్ల పట్టికలో నీరజ్ 5 పాయింట్లతో 7వ స్థానంలో ఉన్నాడు. సెప్టెంబర్‌లో జరిగే ఫైనల్స్‌కు అర్హత సాధించాలంటే రాబోయే రెండు లీగ్‌లలో కనీసం ఒకదానిలోనైనా మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంది. 2022లో డైమండ్ లీగ్ ట్రోఫీని గెలుచుకున్న తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన నీరజ్, ఆసియా గేమ్స్‌లో మళ్లీ పసిడి పతకాన్ని సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 2 ఆగష్టు 2026

## లవ్, బ్రేకప్ వార్తలపై అనుపమ పరమేశ్వరన్ స్పందన

ప్రముఖ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తమిళ్ యంగ్ హీరో ధ్రువ్ విక్రమ్‌తో తన లవ్ లైఫ్, బ్రేకప్ వార్తలపై వస్తున్న ఊహాగానాలపై ఎట్టకేలకు స్పందించింది. నెట్టింట వైరల్ అవుతున్న రూమర్లకు స్వస్తి పలుకుతూ ఆమె చేసిన ఎమోషనల్ కామెంట్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. గత ఏడాది కాలంగా తన జీవితంలో అనేక ఒడిదుడుకులు, మానసిక సంఘర్షణలు ఎదుర్కొన్నానని అనుపమ ఆవేదన వ్యక్తం చేసింది. ఆ సమయంలో అత్యంత కష్టమైన పరిస్థితులను దాటుకుని ముందుకు రావాల్సి వచ్చిందని తెలిపింది. “గత ఏడాది నా జీవితంలో అత్యంత సంక్లిష్టమైన, కష్టతరమైన ఘట్టం నడిచింది. ఆ కష్టాలను దాటుకుని, ఇప్పుడు మళ్లీ నా జీవితంలో సంతోషం, ప్రశాంతత వైపు అడుగులు వేస్తున్నాను” అని అనుపమ పేర్కొంది. పరిస్థితులు ఎలా ఉన్నా మనల్ని మనం ప్రేమించుకోవడం, స్వీయ స్వేచ్ఛను ఎంచుకోవడం ఎంతో ముఖ్యమని చెబుతూ... అభిమానులు, శ్రేయోభిలాషులు అందించిన మద్దతుకు ధన్యవాదాలు తెలిపింది. తమిళ యంగ్ హీరో ధ్రువ్ విక్రమ్‌తో ప్రేమాయణం, తదనంతర బ్రేకప్ వార్తలపై మీడియాలో రకరకాల కథనాలు షికారు చేస్తున్న నేపథ్యంలో, ఆమె పరోక్షంగా ఇచ్చిన ఈ స్పష్టతతో ఆ పుకార్లన్నింటికీ తెరపడినట్లయింది.



# జూనియర్ ఎన్టీఆర్ ‘డ్రాగన్’ సినిమా శ్రీలంక షెడ్యూల్ రద్దు!



యాక్షన్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ – మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ‘డ్రాగన్’ చిత్రం షూటింగ్‌కు బ్రేక్ పడింది. ఇటీవల హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా ఎన్టీఆర్ భుజానికి తీవ్ర గాయమవడంతో సినీ వర్గాల్లో, అభిమానుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. అయితే, వైద్యుల సూచన మేరకు తారక్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారని, కంగారు పడాల్సిన పనిలేదని ఆయన టీమ్ భరోసా ఇచ్చింది. వైద్యులు ఎన్టీఆర్‌ను సుమారు 6 నుంచి 8 వారాల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోమని స్పష్టం చేయడంతో, ‘డ్రాగన్’ చిత్రీకరణను మేకర్స్ తాత్కాలికంగా నిలిపివేసి నట్టు తెలుస్తోంది. ఈ గాయం కారణంగా చిత్ర యూనిట్ ప్లాన్ చేసిన భారీ శ్రీలంక షెడ్యూల్‌ను పూర్తిగా రద్దు చేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఎన్టీఆర్ కోలుకుని మళ్లీ పూర్తి ఫిట్‌నెస్ సాధించిన తర్వాతే.. అంటే సెప్టెంబర్ చివరి వారంలో లేదా అక్టోబర్ ప్రారంభంలో ఈ కొత్త షెడ్యూల్‌ను తిరిగి పట్టాలె క్కించే అవకాశాలున్నాయి. ప్లానింగ్ ప్రకారం ఈ చిత్రాన్ని 2027 జూన్ 11 ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్మాతలు పనిచేస్తున్నారు. షూటింగ్‌కు తాత్కాలిక బ్రేక్ పడినా పోస్ట్ ప్రొడక్షన్, డెడ్‌లైన్లలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు. ప్రమాద ఘటన తర్వాత సామాజిక మాధ్యమాల్లో #GetWellSoonNTR హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. తమ అభిమాన నటుడు త్వరగా కోలుకుని, మరింత శక్తివం తంగా కెమెరా ముందుకు రావాలని అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.

# ఎనిమిదేళ్ల విరామం తర్వాత వెండితెరపైకి ప్రీతి జింటా ఆమిర్ ఖాన్ బ్యానర్లో గ్రాండ్ రీఎంట్రీ



ఒకప్పుడు టాలీవుడ్ ప్రేక్షకులను సైతం మెప్పించిన బాలీవుడ్ నటి ప్రీతి జింటా... సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ వెండితెరపై సందడి చేయడానికి సిద్ధ మయ్యారు. మహేశ్ బాబుతో ‘రాజకుమారుడు’, వెంకటేశ్ సరసన ‘ప్రేమంటే ఇదేరా’ వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు అలరించిన ఆమె, వివాహం అనంతరం సినిమాలకు దూరమయ్యారు. ఇప్పుడు దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ఒక భారీ పీరియాడికల్ డ్రామాతో గ్రాండ్ రీఎంట్రీ ఇస్తున్నారు. బాలీవుడ్ స్టార్ సన్నీ డియోల్ సరసన ప్రీతి జింటా కథానాయికగా నటించిన లేటెస్ట్ పీరియడ్ డ్రామా మూవీ ‘బట్వార్ 1947’. 1947 నాటి దేశ విభజన నేపథ్యంలో ఎంతో ప్రతిష్ఠా త్మకంగా రూపు దిద్దుకున్న ఈ చిత్రాన్ని ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆమిర్ ఖాన్ నిర్మించగా, విలక్షణ దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషి తెరకెక్కించారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చారు. ప్రీతి జింటాతో పాటు సీనియర్ నటి షబానా అజ్మీ, ఆలీ ఫజల్ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో కనిపించను న్నారు.దేశ విభజననాటి పరిస్థితులు, మానవీయ సంబంధాలు, ప్రజలు ఎదుర్కొన్న భావోద్వేగ ఘర్షణల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఇందులో ప్రీతి జింటా ఎంతో ప్రాధాన్యత ఉన్న, బలమైన పాత్రలో నటించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకునితుది పనులు జరుపు కుంటున్న ఈ చిత్రం, స్వాతంత్ర్య దినోత్స వాన్ని పురస్కరించుకుని ఆగస్ట్14న ప్రపం చవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

## పేపర్ లీక్‌తో మళ్లీ నీట్ రాశా.. నాడు నేను పడిన కష్టం వర్ణనాతీతం: మానుషి చిల్లర్

దేశవ్యాప్తంగా నీట్ పరీక్షపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్న ప్రస్తుత తరుణంలో మాజీ ప్రపంచ సుందరి, నటి మానుషి చిల్లర్ తన గతానుభవాలను పంచుకున్నారు. 2015లో నీట్ పేపర్ లీక్ కావడంతో మళ్లీ పరీక్ష రాయాల్సి రావడం తన జీవితంలోనే అత్యంత కఠినమైన దశల్లో ఒకటని ఆమె గుర్తుచేసుకున్నారు. ఇటీవలి విద్యార్థుల ఆందోళనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో మానుషి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నటి సోహా అలీ ఖాన్ పోడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. ఆనాటి అనుభవం కేవలం వ్యక్తిగతమైనదే కాదని, దేశంలోని లక్షలాది మంది విద్యార్థులు ఎదుర్కొంటున్న వాస్తవికతకు అద్దం పట్టిందని ఆమె అన్నారు. “ఈ విషయంలో రెండు కోణాలున్నాయి. ఒకటి నా వ్యక్తిగత అనుభవం, రెండోది దేశంలోని చాలామంది విద్యార్థులు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవడం” అని మానుషి వివరించారు. తన తల్లిదండ్రులు కూడా వైద్య వృత్తిలో ఉండటంతో ఈ ప్రయాణానికి తాను మానసికంగా సిద్ధమయ్యానని, అయినప్పటికీ ఆ ప్రక్రియ ఎంతో భారం మోపిందని తెలిపారు.




PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.